నేడు యూత్ కాంగ్రెస్ జిల్లాస్థాయి సమీక్ష సమావేశం

కామారెడ్డి టౌన్, ఫిబ్రవరి 18: కామారెడ్డి జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో సోమవారం ఉదయం 10 గంటలకు జిల్లా అధ్యక్షుడు ఇలియాస్ ఆధ్వర్యంలో యూత్ కాంగ్రెస్ జిల్లా స్థాయి సమావేశాన్ని నిర్వహించనున్నట్లు యూత్ కాంగ్రెస్ అసెంబ్లీ నియోజకవర్గ అధ్యక్షుడు ఐరేని సందీప్ తెలిపారు. భవిష్యత్తు కార్యాచరణ కోసం అన్ని మండలాల యువజన కాంగ్రెస్ నాయకులకు దిశా నిర్దేశం చేయనున్నారని తెలిపారు. కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

ఇసుకాసురులు


కృత్రిమ ఇసుకను తయారు చేస్తున్న దృశ్యం

- జిల్లాలో యథేచ్ఛగా ఇసుక అక్రమ దందా
- పెరిగిన డిమాండ్‌తో ఇష్టానుసారంగా తవ్వకాలు
- కామారెడ్డి నియోజకవర్గ పరిధిలో కృత్రిమ ఇసుక తయారీ
- ఉచిత విద్యుత్‌ను అక్రమదందాకు వినియోగిస్తున్న వైనం
- ఫిర్యాదు చేసినా పట్టించుకోని అధికారులు


ట్రాక్టర్లలో తీసుకువచ్చి అమ్మకాలు జరుపుతున్న ఇసుక

కామారెడ్డి టౌన్, ఫిబ్రవరి 18: రైతులు పంట పొలాల్లో రకరకాల పంటలు వేసి పండిన పంటను అమ్మకం జరుపు తూ వచ్చిన డబ్బులతో బతుకుబండిని నడిపే వారు.. కానీ ప్రస్తుతం ఆ విధానాన్ని కొద్దికొద్దిగా విస్మరిస్తూ ఆ పంట పొలాలను రియల్ ఎస్టేట్ వ్యాపారులకు అమ్మకాలు జరుపుతూ వచ్చిన డబ్బుతో ఏదో ఓ చోట ఇంత స్థలం తీసుకుని ఇళ్ల నిర్మాణాలు చేపడుతున్న పరిస్థితులు ప్రస్తుతం మనకు చాలా చోట్ల కనిపిస్తూనే ఉన్నాయి. ఇలా గ్రామీణ ప్రాంతాల నుంచి మొదలుకొని పట్టణ ప్రాంతాల వరకు అన్నిచోట్ల వందలాది ఇళ్ల నిర్మాణాలు జరుగుతునే ఉండ డంతో ఇసుకకు భలే డిమాండ్ ఏర్పడింది. డిమాండ్‌కు తగ్గట్టుగా ఇసుక దొరకకపోవడం, ఎక్కడికక్కడ నిబంధనలు పెడుతూ ఇసుక అక్రమ రవాణాను కట్టడి చేస్తున్నా స్థానికంగా ఉండే కొందరు అధికారులు, సిబ్బంది అమ్యామ్యాలకు అలవాటుపడి ఇసుకాసురులకు అండగా నిలవడంతో ఇసుక అక్రమ రవాణాతో పాటు కృత్రిమ ఇసుకను తయారు చేసే స్థాయికి చేరి మూడు పువ్వులు.. ఆరు కాయలుగా దందా కొనసాగిస్తున్నారనే విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. కామారెడ్డి జిల్లాలో చాలా చోట్ల వాగులు పారుతున్నా నిబంధనలు తుంగలో తొక్కి, భారీ యంత్రాలు పెట్టి మరీ తోడేస్తూ అక్రమపద్ధతిలో కోట్లు గడిస్తున్నారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో ఈ అక్రమదందా బహిరంగగానే జరుగుతున్నా ముడుపులకు అలవాటు పడ్డ కొందరు అధికారులు పట్టించుకోవడం లేదని వాదనలు వినిపిస్తున్నాయి.

ఆకర్షిస్తున్న లాభం

ఏ వ్యాపారం చేయాలన్నా.. భారీగా పెట్టుబడులు పెట్టాలి. పదుల సంఖ్యలో పర్మీషన్లు కావాలి. అన్నీ పెట్టుకున్న తర్వాత దందా నడుస్తుందో లేదో తెలియదు. అదే ఇసుకయితే ఏ టెన్షన్ ఉండదు. ఒక్కసారి పెట్టుబడి పెడితే సరిపోతోంది. దానికి ఓ దుకాణం, అడ్డా అంటూ ఏదీ అవసరం లేదు. నేరుగా నిర్మాణం వద్దనే లారీ దింపేయవచ్చు. లేదంటే ఎక్కడో ఓ చోట డంప్ చేసుకుంటే సరిపోతోంది. అవసరమున్నప్పుడు తరలించుకోవచ్చు. అదేం చెడిపోయే వస్తువు కాదు. ఇక అన్నింటికంటే ఇసుక దందాలో వచ్చే లాభాలే అధికంగా ఆకర్షిస్తున్నాయి. అన్ని ఖర్చులు పోయినా నెలకు రూ.లక్షల్లో సంపాదన వస్తుండటమే నాయకులు, వ్యాపారులను ఈ వైపు రప్పిస్తోంది.

కృత్రిమ ఇసుకకు అడ్డుకట్టపడేనా?

కామారెడ్డి నియోజకవర్గంలో ఈ దందాకు హద్దు అదుపు లేకుండా పోతోంది. కామారెడ్డి పట్టణంలోని కొందరు నాయకులు ఆ దందాను ముందుండి నడిపిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. కామారెడ్డి మండలం గూడెంతో పాటు మాచారెడ్డి మండలం ఆరెపల్లి గ్రామాల్లో పంట చేన్ల వద్ద కృత్రిమ ఇసుకను తయారు చేస్తూ వాటిని కామారెడ్డికి తీసుకువచ్చి అమ్మకాలు జరిపిస్తున్నారని ఎప్పటి నుంచో విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. ఈ దందాను కూడా ప్రభుత్వం వ్యవసాయానికి అందించే ఉచిత విద్యుత్‌ను ఉపయోగించి ఇసుకను ఫిల్టర్ చేస్తున్నారని స్థానికులు పేర్కొంటున్నారు. పైగా ఈ దందా గురించి సంబంధిత అధికారులకు వివరిస్తే అప్పటికప్పుడు తనిఖీల పేరుతో అక్కడికి వచ్చి మమ అనిపించేస్తున్నారని పైగా ఫిర్యాదు చేసిన వారి పేర్లను చెబుతూ దందాకు అండగా నిలుస్తున్నారనే విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. ఈ ఇసుకను వాడడం వల్ల నిర్మాణం చేపట్టిన కొద్ది రోజులలోనే బీటలు పడుతాయని నిపుణులు పేర్కొంటున్నారు. గంప గుత్తగా పట్టుకొని ఇళ్ల నిర్మాణాలు చేపట్టే వారు ఈ ఇసుకకు అధిక ప్రాధాన్యత ఇస్తుండడంతో గూడెం ఆరెపల్లి లాంటి ప్రాంతాలలో స్థానిక నేతలతో బేరం కుదుర్చుకుని అడ్డదారిగుండా తెల్లవారు జామున, అర్ధరాత్రి ఇసుకను కామారెడ్డికి పదుల సంఖ్యలో ట్రాక్టర్ల ద్వారా తీసుకువచ్చి అమ్మకాలు జరుపుతున్నా అధికారులు మాత్రం అటువైపు కన్నెత్తి చూడడం లేదని ఆరోపణలు వినిపిసున్నాయి.

నిర్మాణాలు పెరిగిపోవడంతో ఇసుక దందా వైపు అడుగులు

కామారెడ్డి ఎప్పుడైతే జిల్లాగా ఏర్పడిందో.. అప్పటి నుంచి అభివృద్ధి విస్తృతమవుతోంది. జిల్లా కేంద్రంతో పాటు, ఎల్లారెడ్డి, బాన్సువాడ లాంటి మున్సిపాలిటీలతో పాటు ఆయా మండలాల్లో ప్రధానంగా నిర్మాణరంగం దూసుకుపోతోంది. రోజు రోజుకూ జిల్లా రూపమే మారిపోతోంది. జిల్లా ఏర్పడకముందు పదుల సంఖ్యలోనే అపార్ట్‌మెంట్లు అక్కడక్కడ కనిపించేవి. ఇప్పుడు వందల సంఖ్యలోనే భారీ భవనాలు, అపార్ట్‌మెంట్లు కడుతున్నారు. ఇళ్లు, వ్యాపార సముదాయాల నిర్మాణాలకైతే లెక్కేలేదు. దీంతో ఇసుక తోడేసుకునే వారికి వరంగా మారింది. ఏ నిర్మాణమైనా ఇసుక లేనిదే పనికాదు. దీన్నే అవకాశంగా మలుచుకుని చాలా మంది ఈ దందాలోకి దిగుతున్నారు. ముఖ్యంగా రాజకీయ నాయకులుగా చలామణి అవుతున్న వారితో పాటు చోటమోట నాయకులు, కార్యకర్తలు ఈ దందాలను దర్జాగా నిర్వహిస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు దృష్టి సారించి కృత్రిమ ఇసుక తయారీ దారులతో పాటు వాటిని విక్రయిస్తున్న వారిపై దృష్టి సారించి చర్యలు తీసుకుంటేనే అక్రమ ఇసుక రవాణాకు అడ్డుకట్ట వేయవచ్చనే వాదనలు నిర్మాణదారుల నుంచి వినిపిస్తున్నాయి.

ఆస్పత్రి కష్టాలు..
తీరేదెన్నడో?


ఆసుపత్రిలో అడ్డగోలుగా పార్కింగ్

- దీర్ఘకాలిక సమస్యలతో జిల్లా ఆస్పత్రి సతమతం
- ఏళ్లుగా నీటి కటకట
- ఒంటికి, రెంటికి ఇబ్బందే..
- వేయిటింగ్ హాల్ లేక విభాగాల వద్దే భోజనాలు చేస్తున్న పేషంట్ కేర్ టేకర్‌లు
- పార్కింగ్‌తోనూ పరేషానే..

కామారెడ్డి టౌన్, ఫిబ్రవరి 18: కామారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రి అప్‌గ్రేడ్ అవుతున్నా ఏళ్లుగా ఉన్న సమస్యలు మాత్రం తీరడం లేదు. ప్రస్తుతం మెడికల్ కళాశాల అనుబంధంగా ఆసుపత్రి కావడంతో నిపుణులైన వైద్యులు, స్టాఫ్ నర్సులు పెద్ద ఎత్తున వస్తున్నారు. రోగుల తాకిడి రోజురోజుకూ పెరిగిపోతోంది. గర్భిణులు సైతం ప్రభుత్వ ఆసుపత్రిలోనే ప్రసవాలు చేయించుకునేందుకు వస్తుండడంతో ఆసుపత్రి అంతా కిక్కిరిసిపోతోంది. ఇంతలా ఆసుపత్రికి రోగుల తాకిడి పెరుగుతున్నా దీర్ఘకాలికంగా రోగులు, వారి బంధువులు ఎదుర్కొంటున్న సమస్యలు మాత్రం ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అనే చందంగా తయారైంది. ఏరియా ఆసుపత్రిగా ఉన్నప్పుడు ఆసుపత్రిలో నీటి కటకట, పార్కింగ్‌తో పరేషానే ఉంది. ఇప్పటి వరకు ఆసుపత్రికి సొంత నీటి సౌకర్యం కోసం బోరు అనేది లేదు. పోనీ ఆసుపత్రి చుట్టు మున్సిపల్‌కు సంబంధించిన పైప్‌లైన్ ఉన్నా ఒక్క నల్లా కనెక్షన్ కూడా లేదంటే ఏ రకంగా ఆసుపత్రి నిర్వహణ జరుగుతుందో అర్థం చేసుకోవచ్చు. రోగులతో పాటు ఆసుపత్రి సిబ్బంది సైతం సమస్యలను ఎదుర్కొంటూ విధులను నిర్వహించాల్సి వస్తుందని ఆవేదన చెందుతున్నారు. జిల్లా ఉన్నతాధికారులు ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి సమస్యలపై దృష్టి సారిస్తేనే ప్రజలకు ఇక్కట్లు తప్పనున్నాయనే వాదనలు వినిపిస్తున్నాయి.

నీటికి కటకట

ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చిన రోగులకు, వారి వెంట వచ్చిన పేషంట్ కేర్ టేకర్‌లకు, బంధువులకు దాహం వేస్తే తాగేందుకు నీరనేది ఆసుపత్రిలో కనిపించదు. నీటిని తాగాలంటే బయటకు వెళ్లి డబ్బులు ఇచ్చి కొనుగోలు చేయాలి లేదంటే ఓ దుకాణ సముదాయం వద్ద వెళ్లి నీటిని తీసుకొచ్చుకునే పరిస్థితి నెలకొంటుంది. ఈ సమస్య ఏన్నో రోజుల నుంచే ఉందనుకుంటే పొరపాటే ఏళ్ల తరబడి ఈ సమస్యతో ప్రజలు, ఆసుపత్రి సిబ్బంది సతమతమవుతున్నారు. ఆసుపత్రికి నీటి సౌకర్యం కోసం కనీసం ఒక్కటంటే ఒక్క బోరు కూడా లేదు. సులబ్ కాంప్లెక్స్ బోరును అరువుకు వాడుకోవాల్సిన పరిస్థితి ఏర్పడడం. వారి కనికరిస్తేనే ఆసుపత్రిలో నీటి సౌకర్యం ఉందంటే ఏ స్థాయిలో నీటి ఎద్దడి ఉందో అర్థం చేసుకోవచ్చు. ఇక ఒంటికి, రెంటికి వస్తే వాష్‌రూమ్‌లు ఉన్నాయి కానీ వాటిలోంచి నీటికి బదులుగా గాలి మాత్రమే వస్తుందనే రోగులు, వారి బంధు వులు పేర్కొనడం గమనార్హం. దీంతో ఏమి చేయలేక ఆసుపత్రి ప్రాంగణంలో, ముందు ఉన్న సులబ్ కాంప్లెక్స్‌లో డబ్బులు చెల్లించి వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని పలువురు రోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆసుపత్రి చుట్టు మున్సిపల్‌కు చెందిన వాటర్ పైప్‌లైన్ల కనెక్షన్‌లు ఉన్నా ఆ నీటినైన సరఫరా చేసేందుకు చర్యలు శూన్యం. మున్సిపల్ ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేసినా ప్రస్తుతం అవి కూడా కనిపించకుండా పోయాయని ఆసుపత్రి సిబ్బంది పేర్కొంటున్నారు.

వెయిటింగ్ హాలే కనిపించదాయే..

ఇటీవల రోగిని ఎలుకలు కరవడంతో ఈ అంశం రాష్ట్ర వ్యాప్తంగా చర్చ నెలకొంది. ఈ సంఘటనపై విచారణ చేపట్టిన అధికారులు బిల్డింగ్ నిర్మాణం ఒక కారణంగా చెబితే మరో కారణంగా పేషంట్ కేర్ టేకర్‌లు ఆసుపత్రిలో ఆయా విభాగాల వద్ద భోజనాలు చేస్తూ మిగిలిన వ్యర్థాలను అక్కడే పారేస్తుండడంతో ఎలుకల సంతతి పెరుగుతుందనే నివేదికలో పేర్కొన్నట్లు సమాచారం. అయితే ఆసుపత్రి చిన్నగా ఉండడంతో రోగులతో వచ్చిన బంధువుల ఎక్కడ భోజనాలు చేయాలో అర్థం కాక అక్కడే కూర్చుని తమ ఆకలిని తీర్చుకుంటున్నారని తెలుస్తోంది. గతంలో ఉన్న వెయిటింగ్ హాల్‌ను కరోనా సమయంలో ల్యాబ్‌గా నిర్మించారు. దీంతో వెయిటింగ్ హాల్ అనేది కనిపించకుండా పోయింది. ప్రస్తుతం వెయిటింగ్‌హాల్ ఏర్పాటు చేస్తేనే ప్రజలకు ఇక్కట్లు తీరనున్నాయి.

పార్కింగ్‌తోనూ పరేషానే

ఆసుపత్రిలో పార్కింగ్‌తో అష్టకష్టాలు పడాల్సి వస్తోంది. ఆసుపత్రికి వచ్చేవారు, సిబ్బంది, 108 వాహనాలు ఇలా అనేక రకాల వాహనాలు నిత్యం వందకు పైగానే వస్తుంటాయి. ఈ వాహనాలను పార్కింగ్ చేసేందుకు సరైన స్థలమే లేదు. ఉదయం నుంచి మధ్యాహ్నం ఓపీ అయ్యేంత వరకు సిబ్బంది నానా తంటాలు పడాల్సి వస్తోంది. ఆసుపత్రి చుట్టూ వాహనాలను పెడుతుండడంతో అత్యవసర పరిస్థితుల్లో 108 వాహనాలు, అంబులెన్స్‌లో లోనికి రావాలంటే అష్టకష్టాలు పడాల్సి వస్తోంది. అయితే మరో రెండు రోజుల్లో ఆసుపత్రి సిబ్బందితో స్థానిక ఎమ్మెల్యే వెంకట రమణారెడ్డి సమావేశం ఏర్పాటు చేసేందుకు సిద్ధమయినట్లు తెలుస్తోంది. ఆయనతో పాటు కలెక్టర్ దృష్టికి ఈ సమస్యలను తీసుకెళ్లి పరిష్కారానికి అధికారులు కృషి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

గ్రామాల్లో అయోధ్య ప్రసాదం వితరణ


గోజేగావ్‌లో ప్రసాదం వితరణ చేస్తున్న కార్యకర్తలు

మద్నూర్, ఫిబ్రవరి 18: అయోధ్య నుంచి వచ్చిన ప్రసాదాన్ని గ్రామీణ ప్రాంతాల్లో కార్య కర్తలు ఇంటింటికీ వెళ్లి వితరణ చేస్తున్నారు. ఆదివారం మండలంలోని గోజేగావ్, పెద్ద ఎక్లా రా, సోనాలా గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లి అయోధ్య రామ మందిర ప్రసాదాన్ని భక్తు లకు వితరణ చేశారు. మద్నూర్ మండలంలో ని 36 గ్రామాలకు గత మూడు రోజుల నుంచి అయోధ్య ప్రసాద వితరణ కార్యక్రమాన్ని చేపట్టారు. మండల కేంద్రంతో పాటు మరికొన్ని గ్రామాల్లో సోమవారం నుంచి గ్రామాల్లో ఇంటింటికీ అయోధ్య ప్రసాదాన్ని వితరణ చేయనున్నట్లు నిర్వాహకు లు వెల్లడించారు. గత నెల జనవరిలో విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమం సందర్భంగా అక్షింతల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న కార్యకర్తలు ప్రసాద వితరణ కార్యక్రమాన్ని చేపట్టారు.

ఆర్థిక అక్షరాస్యత వారోత్సవాలను విజయవంతం చేయాలి

కామారెడ్డి టౌన్, ఫిబ్రవరి 18: రిజర్వు బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఈనెల 26 నుంచి మార్చి 1 వరకు నిర్వహించే ఆర్థిక అక్షరాస్యత వారోత్సవాలను విజయవంతం చేయాలని జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ భార్గవ్ సుధీర్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మేక్ ఏ రైట్ స్టార్ట్.. బికమ్ ఫైనాన్సియల్ స్మార్ట్ అనే థీమ్‌పై ఆర్థిక అక్షరాస్యత కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ప్రధానంగా పొదుపు, చక్రవడ్డీ శక్తిపై విద్యా ర్థులకు వ్యాస రచన పోటీలతో పాటు స్లోగన్లు, డిజిటల్, సైబర్ భద్రత, పోస్టర్ రూపకల్పన అనే అంశాలపై పోటీలుంటాయని తెలిపారు. ఈ నెల 19 నుంచి 23 వరకు మండల, జిల్లా స్థాయిలో పోటీలు నిర్వహించి విజేతలను రాష్ట్రస్థాయికి పంపుతామ న్నారు. అదేవిధంగా ఈనెల 26న ఆర్థిక అక్షరాస్యత పోస్టర్ ఆవిష్కరణ, 27న 2కే రన్, 28న ఆర్థిక అక్షరాస్యత శిబిరం, 29న అన్ని పాఠశాలలు, కళాశాలల విద్యార్థులతో సమావేశమై ఆర్థిక అక్షరాస్యత ప్రాముఖ్యతపై ప్రసంగాలు, కార్యక్రమాలు ఉంటాయని భార్గవ్ సుధీర్ తెలిపారు.

టార్గెట్ వీక్లీ మార్కెట్!


భిక్కనూరు మార్కెట్‌లో పోలీసులు అవగాహన కల్పిస్తున్న దృశ్యం

- సులువుగా సెల్‌ఫోన్లను చోరీ చేస్తున్న కేటుగాళ్లు
- పోలీసుల పహారా ఉన్న రెచ్చిపోతున్న వైనం

భిక్కనూరు, ఫిబ్రవరి 18: భిక్కనూరు మండల కేంద్రంలోని అంగడిబజార్‌లో ప్రతీ ఆదివారం జరిగే వీక్లీ మార్కెట్ చాలా పెద్దగా సాగుతోంది. భిక్కనూరు మండలం చుట్టూ ఎన్నో ఫ్యాక్టరీలు, రైస్‌మిల్లులు ఉండటం, ఇందులో పని చేయడానికి వందల సంఖ్యలో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌తో పాటుగా ఇతర రాష్ట్రాల కూలీలు పని చేస్తుంటారు. మండల ప్రజలతో పాటుగా ఈ ఫ్యాక్టరీల్లో, రైస్‌మిల్లులో పనిచేసే కూలీలు వందల సంఖ్యలో రావడంతో ఈ మార్కెట్ మధ్యాహ్నం నుంచి రాత్రి 7 గంటల వరకు కిక్కిరిసిపోతుంది. ఇదే అదునుగా భావిస్తున్న సెల్‌ఫోన్ దొంగలు ఈ వీక్లీ మార్కెట్‌ను అడ్డాగా చేసుకుని రెచ్చిపోతున్నారు. ప్రతీ మార్కెట్ రోజున పోలీసులు పహారా కాస్తున్న సెల్‌ఫోన్ దొంగలు మాత్రం వారి చేతివాటాన్ని ప్రదర్శిస్తున్నారు. ప్రతీ మార్కెట్ రోజున తప్పకుండా కనీసం ఐదు సెల్‌ఫోన్‌లైనా చోరీకి గురవుతున్నాయి. దీంతో ఈ మార్కెట్‌కు రావాలంటే సెల్‌ఫోన్‌ను ఇంటివద్దనే పెట్టుకునే పరిస్థితి ఉంది.

సులువుగా చోరీ చేస్తున్న కేటుగాళ్లు

ప్రతీ వీక్లీ మార్కెట్ రోజున కేటుగాళ్లు సెల్‌ఫోన్లను సులువుగా చోరీ చేస్తున్నారు. మార్కెట్‌లో జనాలు ఎక్కువగా ఉండటంతో తోసుకోవడం సాధారణం. మార్కెట్‌లో కూరగాయలను కొనుక్కుంటున్నట్లుగా ఒక బ్యాగును వెంట పెట్టుకొని ఆ బ్యాగులనే అడ్డుగా పెట్టి షర్ట్, ప్యాంటు జేబుల్లో ఉండే సెల్‌ఫోన్లను చాకచక్యంగా కొట్టేస్తున్నారు. ముఖ్యంగా 12 నుంచి 18 సంవత్సరాల పిల్లలే ఈ చోరీలకు పాల్పడుతున్నట్లు పోలీసులు భావిస్తున్నారు. గత చాలా రోజులుగా ఈ మార్కెట్‌లో ఇప్పటి వరకు వందకు పైగా సెల్‌ఫోన్‌లు చోరీకి గురైనట్లు సమాచారం. బాధితులు కొందరు పోలీసులకు ఫిర్యాదు చేస్తుంటే మరికొందరు ఊరుకుంటున్నారు.

ఇటీవల పట్టుపడ్డ బాలుడు

ఇటీవల వీక్లీ మార్కెట్‌లో భిక్కనూరుకు చెందిన శేర్ల లక్ష్మీనారాయణ కూరగాయలను కూర్చుని కొనుక్కుంటున్నాడు. ఈ సమయంలో చేస్తుండగా ఎవరో జేబులో చేయి పెట్టినట్లు అనిపించింది, కూరగాయలను కొనే పనిలో పడి అంతగా పట్టించుకోలేదు. కూరగాయలను కొన్న తర్వాత తన ఫోన్‌ను చూసుకోగా చోరీకి గురైనట్లు గ్రహించాడు. వెంటనే అక్కడే వెతుకుతుండగా ఒక బాలుడు అనుమానాస్పదంగా కన్పించాడు. వెంటనే ఆ బాలుడిని ప్రశ్నించగా అక్కడి నుంచి పరుగెత్తే ప్రయత్నం చేశాడు. అక్కడే ఉన్న వారు అప్రమత్తమై ఆ బాలుడిని పట్టుకుని పోలీసులకు అప్పగించారు.

ప్రతీ సంత రోజున బందోబస్తు నిర్వహిస్తున్నాం

● సాయికుమార్, ఎస్సై భిక్కనూరు

భిక్కనూరు అంగడిబజారులోని వీక్లీ మార్కెట్‌లో సెల్‌ఫోన్లు దొంగతనం జరుగుతుండటంతో ప్రతీ సంత రోజున తప్పకుండా ఇద్దరు సిబ్బంది బందోబస్తు నిర్వహిస్తున్నాం. వీక్లీ మార్కెట్‌లో జరిగే దొంగతనాల నివారణకు మార్కెట్ వచ్చే రైతులతో పాటుగా కూరగాయలను కొనుగోలు చేసేందుకు వచ్చే ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం. ఇటీవల మార్కెట్‌లో 13 సంవత్సరాల బాలుడు సెల్‌ఫోన్ చోరీ చేస్తుండగా తమ సిబ్బంది పట్టుకున్నారన్నారు.

కల్లుగీత వృత్తికి ప్రభుత్వం మార్కెట్ సౌకర్యం కల్పించాలి


సమావేశంలో మాట్లాడుతున్న వెంకట్‌గౌడ్

కామారెడ్డి టౌన్, ఫిబ్రవరి 18: కల్లుగీత వృత్తికి మార్కెట్ సౌకర్యం ప్రభుత్వం కల్పించాలని గీత కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు వెంకట్‌గౌడ్ తెలిపారు. ఆదివారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కల్లుగీత వృత్తిపై 5 లక్షల కుటుంబాలు ఆధారపడి ఉన్నాయని అలాంటి వృత్తిని ప్రభుత్వమే మార్కెట్ సౌకర్యం కల్పించి కల్లు దుకాణాలను ఆధునికీకరణ కోసం డబ్బులు కేటాయించాలని డిమాండ్ చేశారు. ఈత, తాటి చెట్ల పెంపకానికి ప్రతీ గ్రామానికి 5 ఎకరాల భూమి ప్రభుత్వం ఇవ్వాలని డిమాండ్ చేశారు. 560 జీవోను అమలు చేయాలని, ఆసరా పింఛన్ అర్హులైన గీతా కార్మికులందరికీ అమలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు సాయాగౌడ్, నారాగౌడ్, శంకర్‌గౌడ్, రవిగౌడ్, బస్వాగౌడ్, స్వామిగౌడ్, రమేష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

నేడు దోమకొండలో
ఛత్రపతి శివాజీ శోభాయాత్ర

దోమకొండ, ఫిబ్రవరి 18: మండల కేంద్రంలో సోమవారం ఛత్రపతి శివాజీ జయంతి సందర్భంగా సాయంత్రం 4 గంటలకు ప్రధాన వీధుల గుండా శోభాయాత్ర నిర్వహించడం జరుగుతుందని ఛత్రపతి శివాజీ సేవాదళ్ సభ్యులు ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.



'ఇసుక అక్రమ రవాణాపై కఠిన చర్యలు'


పీఎస్‌కు తరలించిన ఇసుక ట్రాక్టర్లు

ధర్పల్లి, ఫిబ్రవరి 18: మండలంలో అక్రమ ఇసుక రవాణాపై కఠిన చర్యలు తప్పవని ఎస్సై వంశీ కృష్ణారెడ్డి హెచ్చరించారు. మండలంలోని వివిధ గ్రామాల్లో అక్రమంగా రాత్రివేళల్లో ఇసుక రవాణా చేస్తున్న ట్రాక్టర్లను పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇసుక అక్రమ రవాణా చేస్తే కఠిన చర్యలు తప్పవని అన్నారు. ఎంతటివారినైనా ఉపేక్షించేది లేదని చెప్పారు. రాత్రి వేళల్లో నిఘా పెంచినట్లు తెలిపారు. పె ట్రోలింగ్ ముమ్మరం చేశామన్నారు.

కమ్మర్‌పల్లి బస్టాండ్‌లో కనీస అవసరాల కరువు

● మరుగుదొడ్లు ఉన్నా నెల రోజులుగా మూసివేత ● ఇబ్బందుల గురవుతున్న మహిళలు ● పట్టించుకోని సంబంధిత అధికారులు

కమ్మర్‌పల్లి,ఫిబ్రవరి18: కమ్మర్‌పల్లి మండల కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్‌లో మరమ్మతు పనులు కొనసాగుతుండగా ప్రయాణికుల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన మరుగుదొడ్లు గత నెల రోజులుగా మూసి ఉంచారు. దీంతో ప్రయాణికుల ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.ఈ బస్టాండ్ మీదుగా రోజువారిగా వివిధ డిపోలకు చెందిన ఆర్టీసీ బస్సులు వందల సంఖ్యలో ప్రయాణికులను చేరవేస్తాయి. అయితే గత రెండు 3 నెలలుగా బస్టాండ్‌లో ఆర్టీసీ సంస్థ మరమ్మతు పనులుచేపట్టింది. భవన మరమ్మతులతో పాటు ప్రహరీ నిర్మాణ పనులు పూర్తిచేశారు. కాగా మరుగుదొడ్ల ఔట్‌లెట్ పైపుల పనులు కొనసాగుతున్నాయి. మరమ్మతు కారణంగా మరుగుదొడ్లను గత నెలరోజులుగా మూసి ఉంచారు. గతకొన్ని రోజులగా పనులు సాగడంలేదు. సదరు కాంట్రాక్టర్ మరుగుదొడ్ల పనులు అర్ధాంతరంగా నిలిపివేశారు. మరుగుదొడ్ల మరమ్మతు పనులు పూర్తికాక మూసి ఉంచడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కుంటున్నారు. మరుగుదొడ్లు లేక ప్రయాణికులు ఎక్కడబడితే అక్కడే మూత్రవిసర్జన చేస్తున్నారు. కాగా పక్కనే ఉన్న ఉన్నత పాఠశాల ప్రహరీని ఆనుకుని మలమూత్రవిసర్జన చేయడంతో పాఠశాల తరగతి గదులవద్ద దుర్గంధ వాతావరణం ఏర్పడుతోంది. దీంతో విద్యార్థులు సైతం ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అధికారులు స్పందించి మరుగుదొడ్ల మరమ్మత్తుపనులు సత్వరం పూర్తి చేయించి ప్రయాణికులకు సౌకర్యం కల్పించాలని కోరుతున్నారు.


మూసి ఉంచిన మరుగుదొడ్లు


మూత్రశాలలు లేక బహిరంగ ప్రదేశంలో మూత్ర విసర్జన ప్రయాణికుడు

రాష్ట్రస్థాయి అబాకస్ పోటీలకు విద్యార్థుల ఎంపిక

మోర్తాడ్, ఫిబ్రవరి 18: మండలంలోని దొన్కల్ గ్రామానికి చెందిన సరస్వతి విద్యానికేతన్ విద్యార్థులు రాష్ట్రస్థాయి అబాకస్ పోటీల్లో ఎంపికయ్యారు. జిల్లాస్థాయిలో శనివారం జరిగిన ఈ పోటీల్లో ఆరో తరగతి విద్యార్థిని సీహెచ్.క్రాంతి, టి.నిహార్ సీనియర్ లెవల్‌లో కార్తిక్ ఎంపికయ్యారు. ఎంపికైన విద్యార్థులను కరస్పాండెంట్ జి.నగేష్, వారికి శిక్షణ ఇచ్చిన ఉపాధ్యాయులు లావణ్య, సౌజన్య, సుచిత్ర, సంజన, కోఆర్డినేటర్ లత అభినందించారు.



ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు

విద్యార్థులు సాంకేతిక రంగాల్లో రాణించాలి




మాట్లాడుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్


బోధన్ రూరల్, ఫిబ్రవరి 18: నేటి తరం విద్యార్థులు చదువుతో పాటు సాంకేతిక రంగాలలో రాణించాలని బోధన్ మున్సిపల్ చైర్‌పర్సన్ తూము పద్మశరత్‌రెడ్డి అన్నారు. ఆదివారం విజేత కళాశాలలో వార్షికోత్సవ వేడుకలు నిర్వహించారు. జ్యోతి ప్రజ్వలన అనంతరం ఆమె మాట్లాడుతూ విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తు ఉపాధ్యాయుల చేతుల్లో ఉందని, కళాశాల విద్యార్థులు కష్టపడి కాకుండా ఇష్టపడి ప్రణాళికలతో చదవాలని సూచించారు. మంచి ఫలితాలు సాధించి కళాశాలకు, తమ తల్లిదండ్రులకు మంచి పేరు తేవాలన్నారు. కార్యక్రమంలో విజేత కళాశాల డైరెక్టర్ రమణారెడ్డి, ప్రిన్సిపాల్ సీఎచ్. భూలక్ష్మిరెడ్డి, డైరెక్టర్ వై.అంజనాదేవి, ప్రిన్సిపాల్ సుప్రజారెడ్డితోపాటు అధ్యాపకుల బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.











తడపాకల్ పాఠశాల వార్షికోత్సవ వేడుకలు


పాఠశాల వార్షికోత్సవంలో పాల్గొన్న ఉపాధ్యాయులు విద్యార్థులు

ఏర్గట్ల, ఫిబ్రవరి 18: మండలంలోని తడపాకల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వార్షికోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈసందర్భంగా పాఠశాలలోని విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు నాటకాలు అందరిని అలరించాయి. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎంఈవో ఆంధ్రయ్య మాట్లాడుతూ తడపాకల్ పాఠశాలలోని విద్యార్థులు చదువుల్లోనూ, విద్యలో ముందున్నారని అభినందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పీఆర్టీయూ అధ్యక్షుడు మోహన్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్ గౌడ్, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు కృష్ణచారి, ప్రధానోపాధ్యాయులు అబ్దుల్ జావీద్, ఎస్సై మచ్చేందర్ రెడ్డి విద్యార్థులు పాల్గొన్నారు.

బోధన్ డివిజన్‌లో స్వచ్ఛ లక్ష్యానికి దూరం

● వినియోగంలో లేని డంపింగ్ యార్డులు ● నిర్వహణ లోపంతో ఆచూకీ లేని స్వచ్ఛత ● గ్రామ ప్రత్యేక అధికారులు దృష్టి సారించాలి



ఏఆర్పీ క్యాంపు గ్రామంలో వృథాగా మారిన కంపోస్టు షెడ్


ప్రధాన రహదారి పక్కన చెత్తవేస్తున్న దృశ్యం

బోధన్ రూరల్, ఫిబ్రవరి 18: బోధన్ డివిజన్‌లోని ఎడపల్లి, రెంజల్, కోటగిరి, బోధన్, సాలూర మండల గ్రామీణ ప్రాంతాల్లో స్వచ్ఛత కోసం గత ప్రభుత్వం తగిన ప్రాధాన్యతనిచ్చింది. అందులో భాగంగా స్వచ్ఛ గ్రామాలుగా మార్చాలన్న లక్ష్యంతో ప్రతి పంచాయతీలో డంపింగ్ యార్డు, కంపోస్ట్ షెడ్‌ల నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. పల్లె ప్రగతిలో డంపింగ్ యార్డు నిర్మాణానికి లక్ష యాభై వేలు, కంపోస్టు షెడ్ నిర్మాణానికి ఉపాధి హామీ పథకం కింద రెండు లక్షల యాభైవేల రూపాయలు నిధులు మంజూరు చేసింది. నిదులు మంజూరు చేయగానే ఆయా గ్రామాల్లో నాటి ప్రజాప్రతినిధులు వాటి నిర్మాణాలపై చూపిన శ్రద్ధ వాటి నిర్వహణపై చూపెట్టకపోవడంతో వాటి లక్ష్యం నెరవేర లేదు. దీంతో కంపోస్టు షెడ్‌లు నిరుపయోగంగా మారాయి. ప్రస్తుతం గ్రామాల్లో ప్రత్యేక అధికారుల పాలన కొనసాగుతుండడంతో ప్రత్యేక అధికారులు స్వచ్ఛతపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలి. అప్పుడే గ్రామాల్లో స్వచ్ఛత నెలకొంటుంది. ఎడపల్లి మండలంలో 17 గ్రామాలు, బోదన్,సాలూర మండలాలు కలిపి 38 గ్రామాలు, కోటగిరి, పోతంగల్ మండలాలో 28గ్రామ పంచాయతీలున్నాయి. ఒక్క పంచాయతీలో డంపింగ్ యార్డుకు లక్ష యాభైవేలు, కంపోస్టు షెడ్‌కు రెండు లక్షల యాభైవేల చొప్పున మూడేళ్ల క్రితం పనులు చేపట్టారు. ఆయా పంచాయతీల్లో స్వచ్ఛ భారత్ పాటు, ఆదాయాన్ని సమకూర్చేందుకు కంపోస్టు షెడ్లు నిర్మించారు. కంపోస్టు షెడ్‌లలో చెత్తను వేరు చేసేందుకు ఆరు కుండీలతో పాటు కంపోస్టు గదులు సైతం నిర్మించారు. తడి చెత్త, కూరగాయాలు, ఆహర వ్యర్థాలు తదితరాలను ఆయా కుండీల్లో వేసి ఎరువుగా మార్చాలి. పూర్తి చేసిన షెడ్లలో ఇప్పటి వరకు వినియోగించిన దాఖలాలు లేవు నిర్మించిన కొన్ని రోజుల పాటు చెత్తను కంపోస్టు షెడ్‌లకు తరలించి ఆ తరువాత వాటి నిర్వహణను మరచి పోవడంతో అవి వృథాగా మారాయి. కొన్నిచోట్ల యార్డుల సమీపంలోనే చెత్తకు నిప్పు పెడుతున్నారు. పంచాయతీలు యార్డులను వినియోగించకపోవడంతో ఎరువుల తయారి లేకుండా పోయింది. ఎరువుల తయారి చేపడితే పల్లె ప్రకృతి వనాలు, హరితహారం మొక్కలకు ఎంతో ఉపయోగంగా ఉండేది. ఆయా గ్రామాల పంచాయతీ అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోకపోవడంతో ప్రభుత్వ ఆశయం నెరవేర లేదు. ఎడపల్లి మండలంలోని ఏఆర్పీ గ్రామంలో కంపోస్టు షెడ్‌ను అంబంకు వెల్లే ప్రదాన రహదారిలో నిర్మించారు. కంపోస్టు షెడ్‌లో ఇప్పటి వరకు ఎలాంటి చెత్తను వేయకపోవడంతో నిరుపయోగంగా మారింది. రాంపూర్ గ్రామంలో గుట్ట ప్రాంతంలో నిర్మించిన షెడ్ అలంకార ప్రాయంగా మారింది. మరికొన్ని గ్రామాల్లో చెరువులు, గుట్టల ప్రాంతాల్లో డంపింగ్ యార్డులు, శ్మశాన వాటికలు నిర్మించిన వినియోగంలోకి రాలేదు. రహదారుల వెంట చెత్తను డంప్ చేసి నిప్పు పెట్టి వదిలేస్తున్నారు. రహదారుల వెంట చెత్తను వేయడంతో దుర్వాసన వెదజల్లుతోంది. దీంతో ప్రజలు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. సర్పంచ్‌ల పదవీకాలం అయిపోయి ప్రత్యేక అధికారుల పాలనలో అయినా అధికారులు స్పందించి కంపోస్టు షెడ్, డంపింగ్ యార్డులు వినియోగంలోకి తీసుకురావాల్సిన అవసరం ఎంతైనా ఉంది. కొత్తగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం గ్రామాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించింది. ఇకనైనా ప్రత్యేక అధికారులు పారిశుధ్యం, పరిశుభ్రతతపై ప్రత్యేక శ్రద్ధ కనబరచాలని గ్రామాలలో నెలకొన్న సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

చెత్తను కంపోస్టు షెడ్‌లలో వేసేలా చర్యలు చేపడతాం



మండలంలోని గ్రామాలలో నిర్మించిన కంపోస్టు షెడ్‌లను పరిశీలిస్తాం. పంచాయితీ కార్మికులు గ్రామాలలో సేకరించిన చెత్తను కంపోస్టు షెడ్‌లలో వేసేలా చర్యలు చేపడతాం. పారిశుధ్యం, పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పిస్తాం. గ్రామ ప్రత్యేక అధికారులు వీటిపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలని సూచనలిస్తాం

-.గోపాల కృష్ణ ఎడపల్లి ఎంపీడీవో

చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి

● జిల్లా లీగల్ ఎయిడ్ సెక్రెటరీ పద్మావతి


ముప్కాల్‌లో మాట్లాడుతున్న జిల్లా లీగల్ ఎయిడ్ సెక్రెటరీ పద్మావతి

ముప్కాల్, ఫిబ్రవరి18: విద్యార్థి దశ నుంచే చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని అప్పుడే నేరాలు అదుపులో ఉంటాయని జిల్లా లీగల్ ఎయిడ్ సెక్రెటరీ పి.పద్మావతి అన్నారు. ఆదివారం ముప్కాల్ మండల కేంద్రంలోని కస్తూర్బాగాంధీ పాఠశాలలో విద్యార్థులకు చట్టాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ఉన్నత పాఠశాల స్థాయిలో పాఠ్యాంశాలలో రాజ్యాంగం, చట్టాలు సంబంధించిన పాఠ్యాంశాలలోనే ఉంటాయన్నారు. పైచదువులు చదివి ఉన్నతస్థాయిలో స్థిరపడిన చట్టాలకు లోబడే ఉండాలని వివరించారు. ఎన్ని ప్రభుత్వాలు మారిన రాజ్యాంగానికి లోబడి పని చేయాల్సిందేనని సూచించారు. మహిళలకు అన్యాయం జరిగిన అవేదన చెందకుండా ఆత్మస్థైర్యం కలిగి ఉండాలని, మహిళలపై అసభ్యంగా ప్రవర్తించి దాన్ని దాచిపెట్టకుండా ధైర్యంగా పోలీసులకు చెప్పాలని సూచించారు. తెలిసి తెలియని వయస్సులో చేసే నేరాలు బాల నేరస్థులుగా గుర్తిస్తారని, వీరికి ప్రత్యేకమైన జువలైన్‌హోంలో ఉంచుతారన్నారు. ప్రతీ ఒక్కరు ఐపీఎస్‌పై అవగాహన కలిగి ఉండాలన్నారు. 14ఏళ్ల వరకు నిర్బంధ విద్య తప్పకుండా చదువుకోవాలని, మన పరిసరాల్లో 14ఏళ్ల లోపు ఎవరైనా పనులు చేస్తుంటే సమాచారం ఇవ్వాలని సూచించారు. 18, 21ఏళ్లు నిండిన తర్వాతే వివాహలు చేసుకోవాలని అవగాహన కల్పించాలని సూచించారు. ఫోక్సో చట్టాల గురించి, బాలకార్మికుల చట్టాలు, ఆన్‌లైన్ మోసాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జూనియర్ సివిల్ న్యాయాధికారి వేముల దీప్తి ఎన్నికష్టాలు వచ్చిన చలించకుండా చదువుపైనే దృష్టి సారించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్నారు. ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్నామని చిన్నచూపు చూడకుండా చదువునేపై దృష్టి సారించాలని, అప్పుడే ఉన్నత స్థాయికి ఎదగవచ్చని అందుకు ఉదాహరణ మేమేనని, మేము కూడా ప్రభుత్వ పాఠశాల చదివి ఈస్థాయిలో ఉన్నామని విద్యార్థులకు ఆత్మస్థైర్యం కలిగించారు. విద్యార్థులకు క్విజ్ ప్రశ్నాలు అడిగి ఉన్నత ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతిగా పుస్తకాలను అందజేశారు. ఈకార్యక్రమంలో ముప్కాల్ ఎస్సై భాస్కరచారి, కోర్టు సూపరింటెండెంట్ రమేష్, మండల లీగల్ సర్వీస్ ఇన్‌చార్జి వసంత్, పాఠశాల ప్రిన్సిపాల్ వినోద, పాఠశాల ఉపాధ్యాయురాలు, పాఠశాల సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.


అబాకస్, వేదిక్ గణిత పోటీలలో సిరికొండ విద్యార్థుల విజయభేరీ


విద్యార్థులకు ప్రశంసా పత్రాలను మెమోంటోలను అందజేస్తున్న దృశ్యం

సిరికొండ ఫిబ్రవరి 18: జిల్లా స్థాయిలో విశ్వం ఎడ్యూటెక్ లాబ్స్ వారి ఆధ్వర్యంలో నిర్వహించిన అబాకస్, వేదిక్ గణిత పోటీలలో సిరికొండ విద్యార్థులు విజయభేరి మోగించారు. జిల్లా కేంద్రంలోని న్యూ అంబేద్కర్ భవన్‌లో జరిగిన కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి ఎన్.వీ దుర్గాప్రసాద్ విద్యార్థులకు ప్రశంసా పత్రాలను మెమోంటోలను అందజేశారు.ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ లక్ష్యం పట్టుదల,నిరంతర సాధన చేసి పోటీ పరీక్షల్లో పాల్గొంటే విజయం మీసొంతం అవుతోందన్నారు.విద్యార్థుల్లో గణితం పట్ల ఉన్న భయాందోళనలు తొలగిపోయి సృజనాత్మకత పెరుగుతుందన్నారు. జ్ఞాపక శక్తి పెరుగుతుందన్నారు. విద్యార్థులు పాఠశాల స్థాయి నుంచి పోటీ పరీక్షల్లో పాల్గొనడం వల్ల వారికుంటే భయాందోళన తొలగిపోతుందన్నారు.అబాకస్‌లో గ్రామీణ ప్రాంతానికి చెందిన సిరికొండ విద్యార్థులు సత్యాశోధక్ పాఠశాల విద్యార్థులు విజయం సాధించడం పట్ల డీఈవో దుర్గాప్రసాద్ అభినందించారు. కార్యక్రమంలో ట్రస్మ జిల్లా అధ్యక్షుడు జయసింహాగౌడ్ పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నేటి నుంచి సీతారాముల బ్రహ్మోత్సవాలు

● సీతారాముల ఆలయం ముస్తాబు ● 19నుంచి 25వరకు ఖిల్లా డిచ్‌పల్లి రామాలయ బ్రహ్మోత్సవాలు


బ్రహ్మోత్సవాలకు ముస్తాబైన ఖిల్లా డిచ్‌పల్లి రామాలయం


ముస్తాబైన సీతరాముల విగ్రహలు

డిచ్‌పల్లి,ఫిబ్రవరి 18: చారిత్రాత్మక ఖిల్లా డిచ్‌పల్లి రామాలయం బ్రహ్మోత్సవాలు (నేటి నుంచి) ఈనెల 19 నుంచి 25వరకు సీతరామ చంద్ర స్వామి బ్రహ్మోత్సవాలు వైభోపేతంగా నిర్వహించేందుకు ఆలయ కమిటీ నిర్వహకులు విస్తృత ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ వేడుకలకు ముఖ్య అతిథులుగా రూరల్ ఎమ్మెల్యే డా.భూపతిరెడ్డి, బోధన్ ఎమ్మెల్యే సుద ర్శన్‌రెడ్డి, శాసనమండలి సభ్యుడు మహేశ్ కుమార్‌గౌడ్ లను ఆహ్వానించినట్లు ఆలయ ధర్మకర్తలి మండలి చైర్మన్ జంగం శాంతయ్య తెలిపారు.6రోజుల పాటు జరగనున్న ఈ ఉత్సవాలకు డిచ్‌పల్లి, ఇందల్వాయి, మోపాల్ మండలతో పాటు జిల్లా నలుమూలల నుంచి భక్తులు తరలి రానున్నారు. 19న ఏకాదశి సందర్భంగా అంకుర్పారణం, అఖండ దీపా రాధన, రక్షబంధనంతో బ్రహ్మోత్సవ పూజలు ప్రారంభమై 21న సీతరా మచంద్ర స్వామి కల్యాణం, 23న రథోత్సవం, 24న జాతర (చక్రతీర్థం) కార్యక్రమాలు జరుగనున్నాయి. ఉత్సవాలు జరిగే ప్రతి రోజు భక్తులకు అన్నదానం నిర్వహించనున్నారు.

జక్రాన్‌పల్లిలో గోడప్రతుల ఆవిష్కరణ


గోడప్రతులను ఆవిష్కరిస్తున్న డివిజన్ కార్యదర్శి బి.దేవరాం

జక్రాన్‌పల్లి, ఫిబ్రవరి18: జక్రాన్‌పల్లి మండల కేంద్రంలో ఆదివారం సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ, సీపీఐఎంఎల్ ప్రజాపంథ ఆధ్వర్యంలో ఆదివారం గోడప్రతులను ఆవిష్కరించారు. ఖమ్మంలో వచ్చేనెల 3, 4, 5తేదీలలో జరిగే ఐక్యత మహాసభలను విజయవంతం చేయాలని సీపీఐ ఎంఎల్ ఆర్మూర్ డివిజన్ కార్యదర్శి బి.దేవరాం, సబ్‌డివిజన్ కార్యదర్శి జి.కిషన్ పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఐక్యత మహాసభలను విజయవంతం చేయాలని కోరుతూ గోడప్రతులను వారు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ, సీపీఐఎంఎల్ ప్రజాపంథ నాయకులు, పీడీఎస్‌యు నాయకులు తలారి గంగాధర్, పీడీఎస్‌యు ఆర్మూర్ ఏరియా అధ్యక్షుడు అనిల్‌కుమార్, వంశీత్, నిఖిల్,కార్మికులు, తదితరులు పాల్గొన్నారు.

ప్రధానోపాధ్యాయుడికి డాక్టరేట్

కోటగిరి,ఫిబ్రవరి18: పొతంగల్ మండలం కొడిచర్ల గ్రామానికి చెందిన నాగయ్య అనే ప్రధానోపాధ్యాయునికి యూనివర్సిటీ ఆఫ్ తోలోసా మెక్సికో ఆధ్వర్యంలో గౌరవ డాక్టరేట్ ప్రధానం చేశారు. నాగయ్య ప్రస్తుతం మద్నూర్ మండలం పెద్ద ఎక్లారా జిల్లా పరిషత్ పాఠశాలలో ప్రధానోపాధ్యాయులుగా పని చేస్తున్నారు. ఉపాధ్యాయుడిగా విధి నిర్వహణతో పాటు సమాజ సేవలో తనవంతు కృషి చేస్తున్న నాగయ్యకు డాక్టరేట్ ప్రధానం చేశారు. నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని సిటి ఫంక్షన్ హాల్‌లో ఈ అవార్డును యూనివర్సిటీ కోఆర్డినేటర్స్ భూమన్న,రాజేశ్వర్, జనార్ధన్‌లు అందించారు. ప్రధానోపాధ్యాయుడికి డాక్టరేట్ అవార్డు ప్రధానం చేయడంపై ఉపాధ్యాయులు, ప్రజాప్రతినిధులు హర్షం వ్యక్తం చేశారు.

నలందలో పాజిటివ్ పేరెంటింగ్ వర్క్‌షాప్

మోస్రా,ఫిబ్రవరి18: మోస్రా మండలంలోని చింతకుంట గ్రామంలో గల నలంద విద్యానిలయంలో శనివారం పాజిటివ్ పేరెంటింగ్ వర్క్‌షాప్ నిర్వహించారు. ముందుగా సరస్వతీ దేవి విగ్రహానికి పూజ చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా పాఠశాల చైర్మన్ లక్ష్మారెడ్డి మాట్లాడుతూ పిల్లల ఎదుగుదల, తల్లిదండ్రుల విధివిధానాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ప్రఖ్యాత సైకాలజిస్ట్, మోటివేషన్ స్పీకర్ తిరునగరి శ్రీహరి, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, గ్రామస్థులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న పాఠశాల చైర్మన్ లక్ష్మారెడ్డి

ట్రాఫిక్ సిగ్నల్స్ ఉన్నా.. ప్రయోజనం సున్నా

● బాన్సువాడలో ట్రాఫిక్ అస్తవ్యస్థం ● ఇష్టారీతిన ప్రయాణాలు● యధేచ్ఛగా సిగ్నల్స్ క్రాసింగ్ ● పోలీసు అధికారుల ఆదేశాలు బేఖాతరు


బాన్సువాడ పట్టణంలో ఇష్టారీతిన వాహనాలు తిరుగుతున్న దృశ్యం

బాన్సువాడటౌన్, ఫిబ్రవరి 15: బాన్సువాడ పట్టణంలో ట్రాఫిక్ నియంత్రణ కోసం అధికారులు ట్రాఫిక్ సిగ్నల్స్‌ను ఏర్పాటు చేశారు. కానీ వాహనదారులు మాత్రం యధేచ్ఛగా నియమాలను ఉల్లంఘిస్తున్నారు. దీంతో ట్రాఫిక్ సమస్య అస్థవ్యస్థంగా మారింది. ఏ వైపు నుంచి ఎవరు వస్తారో తెలియక తికమకపడుతున్నారు. కొన్నిసందర్భాల్లో వాహనాలు ఢీకొట్టుకుంటున్నాయి. అధికారులు చర్యలు తీసుకున్నట్లయితే ట్రాఫిక్ వ్యవస్థ గాడిలో పడినట్లవుతోందని పట్టణ ప్రజలు అభిప్రాయపడుతున్నారు.

● ట్రాఫిక్ అస్థవ్యస్థం

బాన్సువాడ పట్టణానికి ప్రతీ రోజు చుట్టు పక్కల గ్రామాల నుంచి వందల సంఖ్యలో వాహనదారులు రాకపోకలు సాగిస్తున్నారు. వ్యాపారం, బ్యాంకులావాదేవీలు, అమ్మకాలు, కొనుగోల్లు ఇతరత్రా పనుల నిమిత్తం వస్తున్నారు.పట్టణ, గ్రామీణ ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో వాహనాలు వస్తుండడంతో పట్టణంలో రద్దీ పెరిగిపోయింది.ప్రధాన కూడళ్లు అయినటువంటి బస్టాండ్ ప్రాంతం, తాడ్కోల్ చౌరస్తా, బ్యాంకు ప్రాంతాలలో ట్రాఫిక్ సమస్య మరింత జఠిలంగా మారింది. దీంతో అధికారులు ట్రాఫిక్ సమస్యను అధిగమించేందుకు బస్టాండ్ ప్రాంతంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద ట్రాఫిక్ సిగ్నల్స్‌ను ఏర్పాటు చేశారు. కానీ వాహనదారులు మాత్రం యధేచ్ఛగా సిగ్నల్స్ జంప్ చేస్తూ ఇష్టారీతిన వ్యవహరిస్తున్నారు. దీంతో తరచూ వాహనదారులు ఒకరికొకరు ఢీకొట్టుకుంటున్నారు. కొంతమంది వాహనదారులు గాయాలపాలవుతున్నారు. సిగ్నల్స్ దగ్గర ట్రాఫిక్ కానిస్టేబుల్ హెచ్చరిస్తున్నా వాహనదారులు పట్టించుకోవడం లేదు. అంతేకాకుండా ఇష్టారీతిన ట్రాఫిక్ నియమాలను ఉల్లంఘిస్తూనే ఉన్నారు.రెడ్‌సిగ్నల్ పడినా కానీ వాహనదారులు నియమాలను పాటించకపోవడంతో ట్రాఫిక్ సమస్యగా మారుతోంది. కనీసం సిగ్నల్స్ పడినపుడు ఎడమవైపు వెళ్లే వారికి దారి కూడా లేకుండా చేస్తున్నారు. పోలీసు అధికారులు ఆదేశాలను సైతం బేఖాతరు చేస్తూ దర్జాగా వ్యవహరిస్తున్నారు.

సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలి

వాహనదారులు ట్రాఫిక్ సిగ్నల్స్ జంప్ చేయకుండా అధికారులు సీసీ కెమెరాలను ఏర్పాటు చేసి , ట్రాఫిక్ నియమాలను ఉల్లంఘించిన వారిపై జరిమానా విధించాలని మేధావులు అభిప్రాయపడుతున్నారు. పోలీసు అధికారులు వాహనదారులపై కఠిన చర్యలు తీసుకుంటేతప్ప సమస్య పరిష్కారం కాదని స్థానికులు పేర్కొంటున్నారు.

మేడారం జాతరకు బాన్సువాడ డిపో బస్సులు

బాన్సువాడ టౌన్, ఫిబ్రవరి 18: సోమవారం నుంచి 25 వరకు తెలంగాణ కుంభమేళా మేడారం జాతర సందర్భంగా ప్రయాణికులకు రవాణా సౌకర్యం కల్పించడానికి బాన్సువాడ డిపో పరిధిలో గల 62 బస్సు సర్వీసులు వరంగల్ జిల్లాకు వెళ్తున్నట్లు డిపో మేనేజర్ సరితాదేవి తెలిపారు. జాతర సమయంలో జిల్లాలోని వివిధ రూట్లలో బస్సుల ట్రిప్పుల సంఖ్య తగ్గించడం జరుగుతుందని, ప్రయాణికులు ఈ విషయాన్ని గమనించి ఆర్టీసీకి సహకరించాలని ఆమె కోరారు.

21న ఆలయ ప్రాంగణ దుకాణాల వేలం పాట

మద్నూర్, ఫిబ్రవరి 18: మహారాష్ట్ర సరిహద్దులోని సలాబత్‌పూర్ ఆంజనేయ స్వామి ఆలయ ప్రాంగణంలో ఉన్న దుకాణాలకు ఈ నెల 21 బుధవారం బహిరంగ వేలం పాట నిర్వహిస్తామని ఆలయ కార్యదర్శి శ్రీధర్ తెలిపారు. ఈ వేలం పాటలో పాల్గొనే ఆసక్తిగల వారు ఒక రోజు ముందు లేదా సమయానికి 2 గంటల ముందు 10 వేల రూపాయల డిపాజిట్ చెల్లించి వేలం పాటలో పాల్గొనాలని సూచించారు. దేవస్థానానికి చెందిన పూజా సామగ్రి అమ్మేందుకు వేలంపాట నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జిల్లా దేవాదాయ శాఖ ఆదేశాల మేరకు వేలం పాట నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు.



దాబాల వద్ద పోస్టర్లను ఏర్పాటు చేయిస్తున్న ఎస్ఐ

దాబాల్లో సిట్టింగ్ నడిపిస్తే కఠిన చర్యలు తప్పవు

గాంధారి, ఫిబ్రవరి 18: దాబాల్లో సిట్టింగ్ నడిపిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ ఆంజనేయులు తెలిపారు. శనివారం రాత్రి ఆయా దాబాలను పోలీసులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ దాబాలలో రాత్రి వేళల్లో మద్యం తాగి యువకులు ద్విచక్రవాహనాలపై వెళ్తుండడంతో ప్రమాదాలకు గురై మృత్యువాత పడుతున్నారని అందుకే హోటల్లో మద్యం సిట్టింగ్ ఉండకూడదని తెలిపారు. దాబాల వద్ద ఎలాంటి సిట్టింగ్‌లకు అనుమతి లేదని ఫ్లెక్సీలను ఏర్పాటు చేశారు. నిబంధనలు మీరితే దాబా యజమానులపై చట్ట రీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కానిస్టేబుల్‌లు తదితరులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని శవం లభ్యం

బీబీపేట, ఫిబ్రవరి 18: మండలంలోని జనగామ గ్రామ శివారులో గుర్తు తెలియని శవం లభ్యం అయినట్లు ఎస్ఐ ప్రభాకర్ తెలిపారు. అటుగా వెళ్తున్న గ్రామస్థులకు దుర్వాసన రావడంతో సమాచారం అందించారని దీంతో సంఘటన స్థలానికి వెళ్లి విచారించామని తెలిపారు. దాదాపు 40 నుంచి 45 సంవత్సరాల వయస్సు గల మగ మనిషి శవంగా గుర్తించినట్లు తెలిపారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు. ఇప్పటి వరకు చుట్టు పక్కల మండలాల్లో ఎలాంటి మిస్సింగ్ కేసు నమోదు కాలేదని ఎస్ఐ తెలిపారు.

ప్రమాదవశాత్తు ఇల్లు దగ్ధం

తాడ్వాయి, ఫిబ్రవరి 18: తాడ్వాయి మండలం కృష్ణాజీవాడి గ్రామంలో ఆదివారం ప్రమాదవశాత్తు జరిగిన విద్యుత్ ఘాతంతో ఇల్లు దగ్ధమైంది. గ్రామానికి చెందిన జంగం శివకృష్ణ ఇల్లు విద్యుదాఘాతంతో నిప్పంటుకొని పూర్తిగా కాలిపోయింది. ఇంటిలో ఉన్న బియ్యం, విలువైన వస్తువులు వంట సామగ్రి పూర్తిగా దగ్ధమయ్యాయి. ఈ విషయమై అగ్నిమాపక కేంద్రానికి ఫోన్ చేయగా అగ్నిమాపక సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకుని మంటలను ఆర్పి వేశారు. ఇంట్లో ఎవరూ లేకపోవడంతో ప్రాణాపాయం తప్పిపోయినట్లు గ్రామస్థులు తెలిపారు. అధికారులు స్పందించి బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం చేయాలని గ్రామస్థులు కోరుతున్నారు.


బీమా పాలసీ చెక్కును అందజేస్తున్న పోస్టాఫీస్ అధికారులు

బీమా పాలసీ చెక్కు అందజేత

దోమకొండ, ఫిబ్రవరి 18: మండలంలోని సంగమేశ్వర్ గ్రామానికి చెందిన కరికే స్వామి ఇటీవల ప్రమాదవశాత్తు యాక్సిడెంట్‌లో మృతి చెందాడు. పాలసీదారుడు గత సంవత్సరం దోమకొండ పోస్టాఫీస్‌లో రూ.399తో ప్రమాద బీమా చేయించుకోవడంతో పాలసీదారుడి భార్య నామినీగా ఉన్న మంజులకు రూ. పది లక్షల ప్రమాద బీమా చెక్కును నిజామాబాద్ డివిజన్ ఎస్ఎస్‌పీవో చేతుల మీదుగా దోమకొండలో ఆదివారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రూ. 520తో ప్రమాద బీమాను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో కామారెడ్డి సబ్ డివిజన్ ఏఎస్‌పీ భూమన్న, కామారెడ్డి ఐపీపీబీ మేనేజర్ పవన్‌రెడ్డి ఎస్‌పీఎం సంతోష్, ఎంవో మహబూబ్ తదితరులు పాల్గొన్నారు.

వెంచర్ వేసేయ్.. డబ్బు దోచేయ్!


కొనుగోలు చేయరాదని బోర్డు ఏర్పాటు

మద్నూర్, ఫిబ్రవరి 18: స్థిరాస్థి వ్యాపారుల దృష్టి గ్రామీణ ప్రాంతాలపై పడింది. ఊరూరా అక్రమంగా వెంచర్లు వెలుస్తున్నాయి. గ్రామాలకు ఆనుకొని ఉన్న వ్యవసాయ భూములను కొనుగోలు చేసి ఎలాంటి అనుమతులు లేకుండా సదరు వ్యాపారులు స్థానిక నాయకులను మచ్చిక చేసుకొని ఇళ్ల స్థలాలను ఏర్పాటు చేస్తున్నారు. కొనుగోలుదారులకు గుంటల లెక్కన అమ్ముకొని సొమ్ము చేసుకుంటున్నారు.

తక్కువ ధరకు భూముల కొనుగోలు

అనతి కాలంలోనే లక్షలు సంపాదించాలనే లక్ష్యంతో స్థిరాస్థి వ్యాపారులు వ్యవసాయ భూములను కొనుగోలు చేసి నాలా అనుమతులు పొందకుండానే వెంచర్లు ఏర్పాటు చేస్తున్నారు. ఆ వెంచర్లలో ప్రజలకు గుంటల లెక్కన ధరలు నిర్ణయిస్తున్నారు. వెంచర్లలో ముందు భాగంలో ఒక్క రేటు వెనుక భాగంలో మరో రేటు చొప్పున ప్లాట్లను విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. ఆయా గ్రామాల్లో పలువురు అధికారులకు అక్రమంగా వెలుస్తున్న వెంచర్లపై ఫిర్యాదు చేస్తే నోటీసులు జారీ చేస్తున్నారే తప్ప ఎలాంటి చర్యలు చేపట్టడం లేదు. ఇళ్ల స్థలాలు విక్రయించేలా స్థానికంగా నాయకులను మచ్చిక చేసుకొని ఇళ్ల స్థలం లేదా నగదును నజరానాగా అందిస్తుండడంతో వారి వ్యాపారం మూడు పువ్వులు ఆరు కాయలుగా కొనసాగుతోంది. మద్నూర్ మండల, మండల కేంద్రంతో పాటు హండేకేలూర్ గ్రామంలో గ్రామ పంచాయతీ అనుమతి లేకుండానే వెంచర్లు వేయడంతో అక్కడ కొనుగోలు చేసిన లబ్ధిదారులు నష్టపోయారు. దీంతో గ్రామస్థులు జిల్లా కలెక్టర్‌కు కలిసి ఫిర్యాదు చేశారు. స్పందించిన కలెక్టర్ ప్రభుత్వ అనుమతులు లేకుండా ప్లాట్లు విక్రయించినట్లయితే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని బాధితులతో చెప్పినట్లు వెల్లడించారు. అదే విధంగా మండలంలోని జాతీయ రహదారికి ఆనుకొని ఉన్న హండేకేలూర్ గ్రామ శివారులో అక్రమంగా ఏర్పాటు చేసిన వెంచర్లను కొనుగోలు చేయరాదంటూ గ్రామ పంచాయతీ నుంచి బోర్డును ఏర్పాటు చేశారు. ప్లాట్లు కొనుగోలుదారులు కొనుగోలు చేస్తున్న ప్లాట్లను అనుమతులు ఉన్నాయా లేదా తెలుసుకొని కొనుగోలు చేయాలని అధికారులు చెబుతున్నారు.

అక్రమ వెంచర్లలో ఇళ్ల స్థలాలు కొనుగోలు చేయొద్దు

● డీఎల్‌పీవో బాన్సువాడ

ఆయా గ్రామాల్లో వెలిసిన వెంచర్లలో ప్రజలు ఇళ్ల స్థలాలు కొనుగోలు చేయవద్దని ప్రభుత్వ అనుమతి లేకుండా వెంచర్లు ఏర్పాటు చేసే వ్యాపారులకు ఇప్పటికే నోటీసులు జారీ చేశామని అక్రమంగా ఇళ్ల స్థలాలు విక్రయించే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని కొనుగోలుదారులకు డీఎల్‌పీవో సూచిస్తున్నారు.

అసంపూర్తి భవనాలకు మోక్షం కలిగేనా?


శిథిలావస్థలో ఉన్న కమ్యూనిటీ భవనం


అసంపూర్తిగా ఉన్న అంగన్‌వాడీ భవనం

సదాశివనగర్, ఫిబ్రవరి 18: చిన్నారుల సంక్షేమం కోసం ప్రభుత్వాలు ప్రవేశపెడుతున్న పథకాలు అసంపూర్తిగా మిగిలిపోవడంతో ఆ ప్రాంత ప్రజలకు కష్టాలను మిగులుస్తున్నాయి. మండలంలో సుమారు 12 అంగన్‌వాడీ భవనాలను నిర్మాణం చేపట్టి పది సంవత్సరాలు గడుస్తున్నప్పటికీ గత ప్రభుత్వాలు నిర్లక్ష్యం చేయడంతో అసంపూర్తిగానే మిగిలిపోయాయి. సదాశివనగర్ మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీ, జ్యోతినగర్, బీసీ కాలనీల్లో అసంపూర్తిగా అంగన్‌వాడీ భవనాలు ఉండడం, చుట్టూ పిచ్చి మొక్కలు పేరుకపోవడంతో పందులకు, పాములకు ఆవాసాలుగా మారుతున్నాయి. అంగన్‌వాడీలకు అన్ని వసతులు కల్పిస్తున్నామని చెబుతున్నా మాటల వరకే పరిమితమవుతున్నాయని చిన్నారులు వెళ్లే అంగన్ వాడీలపై పాలకులు నిర్లక్ష్యం వహిస్తున్నారనే ఆరోపణలు తల్లిదండ్రుల నుంచి వినిపిస్తున్నాయి. దీంతో పాటు పలు గ్రామాల్లో కమ్యూనిటీ భవనాలు కొన్ని నిధులు మంజూరు చేయడంతో అక్కడక్కడ నిర్మాణం చేపట్టి మధ్యంతరంలోనే నిలిచిపోయాయి. దీంతో ప్రజలు ప్రభుత్వాలపై విస్మయం వ్యక్తం చేస్తున్నారు. గతంలో నిర్మించిన కమ్యూనిటీ భవనాల మరమ్మతులు లేక కూలిపోయే స్థితిలో మగ్గుతుండడంతో కమ్యూనిటీ ప్రజలు సమావేశాలు నిర్వహించడానికి స్థలాలు లేక రోడ్లపై కూర్చోవాల్సిన పరిస్థితి తలెత్తింది. గత ప్రభుత్వాలు చేసిన తప్పిదాలను దృష్టిలో ఉంచుకుని ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు గ్రామాల్లో ప్రత్యేక సర్వేలు నిర్వహించి అసంపూర్తి భవనాలపై దృష్టిసారించాలని ప్రజలు కోరుతున్నారు.

నిజాంసాగర్ కాలువలో పూడికతీత పనుల ప్రారంభం

కోటగిరి, ఫిబ్రవరి 18: కోటగిరి ఉమ్మడి మండలంలో నిజాంసాగర్ కాలువ పూడిక తీత పనులను ఆదివారం మాజీ జడ్పీటీసీ శంకర్, కృష్ణారెడ్డిలు ప్రారంభించారు. నిజాంసాగర్ కాలువలో పూడిక పేరుకుపోయి చివరి ఆయకట్టుకు నీరు అందలేని పరిస్థితి తలెత్తింది. బాన్సువాడ నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు ఏనుగు రవీందర్ రెడ్డి సాగునీటి కాలువలను పరిశీలించారు. కోటగిరి మండలంలోని కొత్తపల్లి, ఎత్తొండ, పొతంగల్ మండలంలోని హంగర్గ ఫారం, హెగ్డోలి, శేషాద్రి ఫారం గ్రామాలకు సాగునీరు అందక రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. కాలువల్లో ముళ్లపొదలు పూడిక పెరిగి సాగునీరు అందక పంటలు ఎండిపోయే పరిస్థితి తలెత్తింది. ఈ సమస్యపై కాంగ్రెస్ ఇన్‌చార్జి ఏనుగు రవీందర్ రెడ్డి ప్రత్యేక దృష్టి సారించారు. కాలువల్లో పూడిక తొలగించేందుకు సుమారు రూ.20లక్షల మంజూరు చేయించారు. కొత్తపల్లి గ్రామంలో సాగునీటి కాలువ మురికి కాలువగా మారింది. జేసీబీ సాయంతో కాలువలో పేరుకు పోయిన పూడికను తొలగించడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. పలు చోట్ల కాలువలు శిథిలావస్థకు చేరగా మరమ్మతు పనులు సైతం చేపట్టి రైతులకు సక్రమంగా నీరు అందేలా కృషి చేస్తామని కాంగ్రెస్ నాయకులు పేర్కొన్నారు. రబీలో పంటలకు సాగునీరు సరిపడ అందిస్తామని కాంగ్రెస్ నాయకులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల కాంగ్రెస్ నాయకులు కొండా రెడ్డి, రమణారెడ్డి, జైపాల్, రవి, కోటిరెడ్డి, సుబ్బారెడ్డి, నాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.


కొత్తపల్లిలో కాలువలో జేసీబీ సాయంతో పూడిక తొలగిస్తున్న దృశ్యం

బాల్య వివాహాన్ని అడ్డుకున్న అధికారులు

ధర్పల్లి, ఫిబ్రవరి 18:మండల కేంద్రంలో బాల్య వివాహాన్ని ఐసీడీ ఎస్, పోలీసులు అడ్డుకున్నారు. గ్రామంలో బాల్య వివాహం జరుగుతున్నట్లు తెలుసుకున్న ఐసీడీఎస్ అధికారులు స్థానిక పోలీస్ స్టేషన్‌లో సమాచారం ఇచ్చారు. పోలీసులు, ఐసీడీఎస్ సిబ్బంది బాల్య వివాహం జరుగుతున్న ప్రదేశానికి వెళ్లి కౌన్సెలింగ్ నిర్వహించారు. బాల్య వివాహాల వల్ల కలిగే నష్టాలను ఈ సందర్భంగా వారు వివరించారు. బాల్య వివాహాలు నేరమని చట్టరిత్యా శిక్ష అర్హులు అవుతారని వధువు, వరుడు కుటుంబ సభ్యులకు కౌన్సిలింగ్ నిర్వహించారు. కౌన్సిలింగ్ అనంతరం కుటుంబ సభ్యులు సైతం వివాహాన్ని విరమించుకున్నారు. మేజర్ అయిన తర్వాతనే పెళ్లి చేస్తామని అధికారులకు చెప్పారు. ఈ కార్యక్రమంలో చైల్డ్ లైన్ ప్రాజెక్టు కోఆర్డినేటర్ జ్యోష్న, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ బుజ్జి, ఎస్సై వంశీకృష్ణారెడ్డి పాల్గొన్నారు.


కుటుంబ సభ్యులకు కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న అధికారులు

అభివృద్ధిలో నాణ్యత లోపం

వర్ని, ఫిబ్రవరి 18: గ్రామీణ ప్రాంతాల రహదారుల అభివృద్ధి కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు లక్షలాది రూపాయల నిధులు కేటాయిస్తున్నా నిర్మాణ పనుల్లో నాణ్యత లోపం కారణంగా మున్నాళ్ల ముచ్చటగా మారుతున్నాయి. గత ప్రభుత్వ హయాంలో ఎస్‌డీఎఫ్ నిధుల ద్వారా వర్ని, చందూర్, రుద్రూర్ మండలాల్లో సీసీ రోడ్ల నిర్మాణాలు పెద్ద ఎత్తున చేపట్టారు. కొన్ని గ్రామాల్లో అవసరం లేని చోట సైతం సీసీ రోడ్లను నిర్మించారు. వీటి నాణ్యత పనులను పరిశీలించాల్సిన పంచాయతీ రాజ్ అధికారులు అడ్డగోలుగా ఎంబీ రికార్డులు పూర్తి చేసి కాంట్రాక్టర్లు, నాయకులకు కొమ్ముకాశారు. దీంతో నిర్మించిన ఆరు నెలల్లోనే రోడ్లకు పగుళ్లు ఏర్పడి కంకర తేలుతోంది.

రూరల్ ఎమ్మెల్యే కుమారుడి వివాహానికి హాజరైన సీఎం


సీఎం రేవంత్‌రెడ్డితో జిల్లా కాంగ్రెస్ నాయకులు

నిజామాబాద్ అర్బన్, ఫిబ్రవరి 18: నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి కుమారుడు స్నేహిత్‌రెడ్డి వివాహం రిక్షితతో ఆదివారం హైదరాబాద్‌లోని జెన్విన్ కన్వెన్షన్‌లో నిర్వహించిన వివాహానికి సీఎం రేవంత్‌రెడ్డితో పాటు మాజీ మంత్రులు సుదర్శన్‌రెడ్డి, జానారెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారుడు షబ్బీర్‌అలీ, పెద్దపల్లి ఎమ్మె ల్యే వివేక్‌తో పాటు పలువురు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీ మహేష్‌కుమార్‌గౌడ్ హాజరయ్యారు. నూతన వధూవరులను ఆశీర్వదించారు.

పదో తరగతి విద్యార్థులకు ప్రతిభ పరీక్ష


పరీక్ష పత్రాలను విడుదల చేస్తున్న ఎంఈవో, ఎస్ఐ

కామారెడ్డి టౌన్, ఫిబ్రవరి 18: కామారెడ్డి జిల్లా కేంద్రంలోని సాందీపని జూనియర్ కళాశాలలో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఆదివారం పదో తరగతి విద్యార్థులకు ప్రతిభ పరీక్షలు నిర్వహించారు. పరీక్ష ప్రశ్న పత్రాలను ఎంఈవో ఎల్లయ్య, ఎస్ఐ అనిల్ ఆధ్వర్యంలో విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు అరుణ్ మాట్లాడుతూ పరీక్షల పట్ల విద్యార్థులకు ఉన్న భయాన్ని పోగొట్టి వాళ్లలో అవగాహన తీసుకురావడానికి ఇలాంటి పరీక్షలు ఎంతగానో ఉపయోగపడుతాయని అన్నారు. పదో తరగతి విద్యార్థులు వార్షిక పరీక్షలకు సంసిద్ధం అవుతున్న సందర్భంలో ఇలాంటి పరీక్షలు నిర్వహించడం వారికి ఎంతగానో ఉపయోగపడుతుందని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకున్న విద్యార్థులకు అభినందనలు తెలుపుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కన్వీనర్ చంద్రశేఖర్, సాందీపని కళాశాల ప్రిన్సిపాల్ సాయిబాబా, డైరెక్టర్ రాజశేఖర్, నాయకులు సంతోష్, నితీన్, సమీర్, విష్ణు, సాయి, రాహుల్, సచిన్, నగేష్ తదితరులు పాల్గొన్నారు.


రహదారిపై వార సంత నిర్వహిస్తున్న దృశ్యం

రహదారిపైనే వార సంత

మద్నూర్, ఫిబ్రవరి 18: మండల కేంద్రంలో నిర్వహిస్తున్న వారాంతపు సంతలో స్థానిక ప్రజలు ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. వారాంతపు సంతలో అవస్థలను గుర్తించి వాటిని పరిష్కరిస్తారని ప్రజలు ఎదురు చూస్తున్నారు. మండల కేంద్రంలోని గాంధీచౌక్ నుంచి పాత బస్టాండ్ వరకు సంత ఏర్పాటు చేయడంతో రోడ్డుపైన ప్రమాదాలు జరిగే అవకాశాలు ఉన్నాయి. గాంధీచౌక్ నుంచి పాత బస్టాండ్ వరకు ఏర్పాటు చేస్తున్న సంత జరిగే స్థలం వెడల్పులో తక్కువగా ఉంటుంది. దాదాపు 42 గ్రామాల నుంచి ప్రజలు సంతకు వస్తుంటారు. ఈ గ్రామాల నుంచి వ్యాపారులు వస్తారు. వారికి ఇబ్బందులు తప్పడం లేదు. సంత రోజు గాంధీచౌక్ పాత బస్టాండ్ వరకు ఇరువైపుల నుంచి వ్యాపారులు కూరగాయల దుకణాలు ఉండడంతో కేవలం 4 ఫీట్ల రోడ్డు మాత్రమే ఉంటుంది. సంతలో తోచుకుంటూరావాల్సిన పరిస్థితి ఉంది. ఏదైన వాహనం గ్రామంలోకి రావాలంటే ఇదే దారిన రావాల్సి ఉంది. సంత మధ్యలో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. అదే విధంగా సంతకు వచ్చే ప్రజల కోసం మౌలిక వసతులు కల్పించాలని ప్రజలు కోరుతున్నారు. గతంలో ఉన్న విధంగా గాంధీచౌక్ నుంచి నాలుగు వైపుల సంత జరిగే విధంగా ఏర్పాట్లు చేసినట్లైతే పాత బస్టాండ్ జాతీయ రహదారి వరకు సంత ఉండకుండా చూడాలని వ్యాపారులు కోరుతున్నారు. గాంధీచౌక్ నుంచి నాలుగు కూడళ్లలో సంత ఏర్పాటు చేయాలని ఇటీవల మద్నూర్ వ్యాపారులు మద్నూర్ గ్రామ పంచాయతీ ప్రత్యేకాధికారికి వినతి పత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా ప్రత్యేకాధికారి బండివార్ విజయ్ మాట్లాడుతూ ప్రజల కోసం మౌలిక వసతుల కల్పనలో భాగంగా మూత్రశాలల ఏర్పాటు కోసం 4 లక్షల నిధులను విడుదల చేసినట్లు తెలిపారు. మూత్రశాలల నిర్మాణంతో పాటు మండల కేంద్రంలోని నాలుగు కూడళ్లలో సంత జరిగే విధంగా ఏర్పాట్లు చేయడానికి తన వంతు కృషి చేస్తానన్నారు.

విద్యార్థులు ఉన్నత చదువులు చదువుకోవాలి


చిన్నారులకు స్టీల్ వాటర్ బాటిళ్లు పంపిణీ చేస్తున్న యోగాటీం

డిచ్‌పల్లి, ఫిబ్రవరి 18: మానవత సదన్‌చిన్నారులు ఉన్నత చదువుల్లో రాణించాలని, బోర్గాం యోగా టీం ప్రతినిధి ప్రభాకర్ అన్నారు. ఆదివారం డిచ్‌పల్లిలోని మానవత సదన్‌లో 130మందికి స్టీల్ వాటర్ బాటిళ్లు ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్రతినిధి ప్రభాకర్ మాట్లాడుతూ.. విద్యార్థులు చదువు ద్వారా ఏదైనా సాధించవచ్చని చిన్నారులకు ఎల్లపుడు తాము అండగా ఉంటామని నాటి జిల్లా కలెక్టర్ యోగిత రాణా ఆనాథ చిన్నారుల కోసం ఈ ఆశ్రమం ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో యోగా టీం సభ్యులు సంతోశ్, రమేశ్, ప్రకాశ్, రమేశ్, జయప్రకాశ్ పాల్గొన్నారు.

రెండు ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

కోటగిరి, ఫిబ్రవరి 18: పొతంగల్ గ్రామ శివారులో అక్రమంగా తరలిస్తున్న రెండు ఇసుక ట్రాక్టర్లను శనివారం రాత్రి పట్టుకున్నట్లు ఎస్ఐ సందీప్ తెలిపారు. మంజీర నది నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్నారన్న సమాచారం మేరకు ట్రాక్టర్‌ను పట్టుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించామన్నారు. అనుమతి లేకుండా ఇసుక అక్రమ రవాణా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ హెచ్చరించారు.

గ్రామదేవతలకు సలిబోనాలు

ముప్కాల్, ఫిబ్రవరి 18: మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం సలిబోనాలు సమర్పించారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి అభిషేకాలు చేసి ప్రత్యేక పూజలు చేసి నైవేద్యాలను సమర్పించారు.

సినిమా గైడ్ కామారెడ్డి

కామారెడ్డి

థియేటర్		సినిమా
దర్శన్	-	హనుమాన్
శాంతి	-	ఊరు పేరు భైరవకోన
ప్రియా 70	-	ఈగల్
ప్రియా 35	-	రాజధాని ఫైల్స్

బాన్సువాడ

థియేటర్		సినిమా
మహేశ్వరి	-	ఊరు పేరు భైరవకోన
వెంకటేశ్వర	-	లాల్ సలామ్



చికెన్ ధరలు

రకం	:	లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	:	100	160	180
వెన్‌కాబ్(కిలో)	:	100	180	210